క్లుప్తంగా

పశుమిత్రలను ఆదుకోవాలి



ఏపీఎం దుర్గారావుకు వినతిపత్రం అందజేస్తున్న పశుమిత్రలు

ఇల్లెందు: తెలంగాణ రాష్ట్రంలో 2500 మంది పశుమిత్రలు పని చేస్తున్నారని, ఎనిమిదేళ్లుగా పశువుల సేవల్లో ఉన్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన కార్యక్రమంలో పశుమిత్రలతో కలిసి ఏపీఎం దుర్గారావుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, గుర్తింపు కార్డులు అందజేయాలని, యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, మందులతో కూడిన కిట్లు అందజేయాలని కోరారు. పని భద్రత, ప్రమాద బీమా సౌకర్యం, కృత్రిమ గర్భధారణ శిక్షణ ఇప్పించాలని కోరారు. పశుమిత్రల డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని తెలిపారు.

బీమాపై అవగాహన కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలో మేళాలు నిర్వహించి ప్రజలకు బీమా పథకంపై అవగాహన కల్పించాలని పోస్టాఫీసు సబ్ డివిజన్ ఏఎస్‌పీ రంజిత్‌కుమార్ చౌదరి తెలిపారు. శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలోని మైలారం, బంగారుచెలక, లక్ష్మీపురం, రేగళ్ల తదితర బ్రాంచ్ పోస్టాఫీస్ పరిధిలో మేళాలు నిర్వహించి, ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలకు బీమాపై అవగాహన కల్పించారు. ఇతర బీమా సంస్థలతో పోలిస్తే తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ తపాలా బీమా ద్వారా వస్తుందని, ప్రజలందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 31 వర కు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని బ్రాంచ్ పోస్టాఫీస్‌లలో ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు వారు దగ్గరలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గట్టుమల్ల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైలారంలను అకాడమిక్ మోనిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కె సైదులు శుక్రవారం సందర్శించారు. తొలిమెట్టు అమలులో భాగంగా 1 – 5 తరగతుల విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిష్, గణితములలో కనీస సామర్థ్యాల సాధనకై ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించగా కనీస అభ్యసన సామర్థ్యాలను కూడా వారు సాధించలేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి పబ్లిక్ పరీక్షలు దృష్ట్యా గణితము, భౌతిక, రసాయన శాస్త్రాల్లో వారికి గల సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాలలో జరుగుతున్న మన ఊరు – మన బడి పనులను పరిశీలించి హెచ్‌ఎం పనులలో నాణ్యత పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.

సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి రామవరం 10వ వార్డులో మున్సిపాలిటీ, ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో సామాజిక వేడుకల్లో భాగంగా శుక్రవారం 19వ అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక సీమంతాలు, అన్నప్రాశన, అక్షరాభ్యాస కార్యక్రమాలను వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఈ సామాజిక వేడుకలతో అంగన్‌వాడీ ప్రాంగణం పండుగ వాతావరణంలా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రజల్లో మానవతా విలువలు, సత్సంబంధాలు మెరుగుపడతాయని చెప్పారు. చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు.

కరపత్రాలు విడుదల

సుజాతనగర్: ఈ నెల 21న మండల పరిధిలోకి రానున్న ప్రజాచైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు వీర్ల రమేష్ పిలుపునిచ్చారు. యాత్రకు సంబంధించిన కరపత్రాలను పాత అంజనాపురం గ్రామంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా యాత్ర కొనసాగుతుందన్నారు. మండలానికి యాత్ర వస్తున్న సందర్భంగా వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండమల్ల భాస్కర్, సోలం నాగరత్నమ్మ, బత్తుల కళావతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రెండే గదులు.. ఐదు తరగతులు

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- యానంబైల్ పాఠశాలలో మౌలిక వసతుల లేమి



శిథిలావస్థకు చేరిన యానంబైల్ ప్రాథమిక పాఠశాల భవనం

పాల్వంచరూరల్: విద్యాహక్కు చట్టం అమలుపై అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 2009లో కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన బాలల ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి. కానీ ఆచరణలో మాత్రం ఇది సాధ్యం కావడం లేదు. మండలంలోని యానంబైల్ ప్రాథమిక పాఠశాలలో చదివిన విద్యార్థి వీరబ్రహ్మయ్య నేడు కలెక్టర్ స్థాయికి ఎదిగినా ఈ బడిలో సమస్యలు తీరడం లేదు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 72 మంది విద్యార్థులున్న యానంబైల్ ప్రాథమిక పాఠశాలలో (ఇంగ్లిష్ మీడియం) రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ముగ్గురు ఉపాధ్యాయులకు ఇద్దరూ మాత్రమే ఉన్నారు. టీచర్ల కొరత, అరకొర తరగతి గదులు, తాగునీటి సమస్యలు నెలకొన్నాయి. ఒక్కో గదిలో 32 మంది విద్యార్థులను కుర్చోబెట్టినా సరిపోక వరండాలో తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి. పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే కురుస్తుంది. మన ఊరు – మన బడి కింద గతేడాది రూ.5.94 లక్షల నిధులు మంజూరైనా నేటికీ పనులు పూర్తికాలేదు. అదేవిధంగా ఇదే కాంప్లెక్స్ పరిధి మందేరకలపాడు పాఠశాలలో 32మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు టీచర్లు ఉన్నారు. ఇందులో ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. రాజాపురం గ్రామంలోని పాఠశాలలో 1నుంచి 5వ తరగతులు ఉండగా 30మంది విద్యార్థులు ఉన్నారు. ఒక టీచర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సత్యనారాయణపురం పాఠశాలలో 1నుంచి 7వ తరగతి ఉండగా 52మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు ఉన్నారు. ఇక్కడ అదనంగా టీచర్లు ఉన్నా టీచర్లు లేని పాఠశాలలకు బదిలీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాల భవనంతోపాటు తరగతి గదులు, వికలాంగుల ప్రవేశానికి ర్యాంప్‌లు, మధ్యాహ్న భోజనాల కోసం వంటగది, ఆటస్థలం, ప్రహరీ, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉండాలి. ఈ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు చేతులెత్తేశారు.

నిరుపయోగంగా మూత్రశాలలు...

యానంబైల్ ప్రాథమిక పాఠశాల వెనక ఉపాధి హామీ పథకం కింద రెండు సంవత్సరాల క్రితం రూ.2.20లక్షలు ఖర్చు చేసి విద్యార్థుల కోసం రెండు మూత్రశాలలు నిర్మాణం చేశారు కానీ, నీటి సౌకర్యం మరిచారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. విద్యార్థులు మాత్రం ఆరుబయట చెట్లపొదల్లోకి వెళ్తున్నారు. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ప్రాంగణంలోకి విష సర్పాలు, క్రిమి కీటకాలు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గదులు లేక వరండాలో కూర్చున్న విద్యార్థులు

టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించకపోవడం వలన విద్యార్థులు చదువులో వెనుకబడిపోతున్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

– బొప్పిశెట్టి నరేష్, యానంబైల్

ప్రతిపాదనలు పంపించాం



పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు గాను ఇద్దరం మాత్రమే ఉన్నాం. మరుగుదొడ్డి, మూత్రశాలలను పాఠశాలకు కేటాయించాలని సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. మన ఊరు – మన బడి కింద మంజూరైన నిధులతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నాం.

– వీరన్న, హెచ్‌ఎం, యానంబైల్ పాఠశాల

త్వరలో టీచర్లను నియమిస్తాం



యానంబైల్ ప్రాథమిక పాఠశాలతోపాటు కాంప్లెక్స్ పరిధిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను తర్వలో భర్తీ చేస్తాం. మన ఊరు – మన బడి కింద యానంబైల్ ప్రాథమిక పాఠశాలకు మంజూరైన నిధులతో ప్రహరీ, తరగతి గదులకు మరమ్మతులు నిర్వహిస్తాం.

– శ్రీరామ్మూర్తి, మండల విద్యాశాఖాధికారి

ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వాలు



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

సింగరేణి(కొత్తగూడెం): ప్రజాసంక్షేమం అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జిల్లా కార్యదర్శి కెచ్చెర్ల రంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో ఆనాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్‌కు అధికారం కట్టబెడితే.. నిత్యావసరాల ధరలు పెంచుతూ సామాన్యుల జీవితాలను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. పేదవాళ్లను పేదవాళ్లుగానే ఉంచుతూ, ధనికులను మరింత ధనికులను చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనను విరమించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు తీవ్రంగా కలిచివేస్తున్నాయని, ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తికాకుండానే డ్రాపేరుతో కొత్త డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో చంద్ర అరుణ, జాటోత్ కృష్ణ, మాచర్ల సత్యం, ఆజాద్, పెద్దబోయిన సతీష్, పాపారావు, చంద్రశేఖర్, జ్యోతి, రాజశేఖర్, నర్సయ్య, ఆదిలక్ష్మి, ఎం.కృష్ణయ్య, నరేష్, వెంకటమ్మ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు 'చాట్ల'కు సన్మానం



చాట్ల శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

పాల్వంచ: పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ పాల్వంచ అధ్యక్షుడు చాట్ల శ్రీనివాసరావును సన్మానించారు. శుక్రవారం మధిరలో ఆర్కే ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న జాతీయ ఉత్తమ సేవా పురస్కారాల్లో భాగంగా చాట్ల శ్రీనివాసరావుకు జబర్దస్త్ ఫేం అప్పారావు చేతుల మీదుగా సన్మానించి, మెమెంటో అందించారు. కార్యక్రమంలో తైక్వాండో క్రీడాకారిణి సింధు తపస్వీ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ



తనిఖీ చేస్తున్న సుకృత

చుంచుపల్లి: జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశాల మేరకు శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత, డిప్యూటీ డెమో ఎండీ ఫయాజుద్దీన్ కొత్తగూడెం పట్టణంలో పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. డాక్టర్ సుకృత మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఆస్పత్రులను నడపడం, అర్హత లేని వారిని పనుల్లో నియమించటం చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగుల నుంచి వసూలు చేసే ఫీజు చార్జులు ప్రదర్శించాలని సూచించారు.

21న జన చైతన్య బహిరంగ సభ



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జూలూరుపాడు: సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ సారథ్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర ఈనెల 21వ తేదీ సాయంత్రం 4 గంటలకు జూలూరుపాడు చేరుకోనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. జన చైతన్య యాత్ర బహిరంగ సభ నిర్వహించేందుకు మండల కేంద్రం జూలూరుపాడులోని డాక్టర్ అంబేడ్కర్ సెంటర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం హన్మకొండలో ప్రారంభమైన జన చైతన్య యాత్ర ఈనెల 19న చర్ల మండలం చేరుకుంటుందని, 21 సాయంత్రం జూలూరుపాడుకు చేరుకుంటుందని, అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సభను జయప్రదం చేసేందుకు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఏజే రమేష్, వీర్ల రమేష్, యాసా నరేష్, గార్లపాటి వెంకటి, వల్లమల చందర్‌రావు, గార్లపాటి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులకు అపార నష్టం





పాల్వంచరూరల్: రెడ్డిగూడెంలో తడిసిన మిర్చి, ఇల్లెందురూరల్: కొమరారంలో నేలవాలిన మొక్కజొన్న

పాల్వంచరూరల్: శుక్రవారం మండలంలో భారీవర్షం కురిసింది. దీంతో వీధుల్లో వరదనీరు ప్రవహించగా, పంటలు తడిసి రైతులకు నష్టం వాటిల్లింది. కల్లాల్లోని మిర్చి తడిసిపోగా, మొక్కజొన్న పంట నేలవాలింది. చేతికివచ్చిన పంటలు అకాల వర్షంతో తడిసిముద్దయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జూలూరుపాడు: తుఫాను ప్రభావంతో జూలూరుపాడు మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో సుమారు గంటపైగా భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో కల్లాల్లోని మిర్చి తడిసింది. గురువారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడటంతో అప్రమత్తమైన రైతులు మిర్చి పంట తడవకుండా పట్టాలు కప్పి జాగ్రత్తపడ్డారు.

ఇల్లెందురూరల్: మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన వర్షంతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు పంట చేల వద్దకు పరుగులు తీశారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట చేతికందే దశలో ఉంది. ఈ దశలో భారీ వర్షానికి మొక్కజొన్న నేలవాలింది. కొంత మంది రైతులు ఇప్పటికే కంకులు కోసి మిల్లు పట్టేందుకు సిద్ధం చేయగా.. ఉరుములు, మెరుపులతో పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా భారీ వర్షంతో పల్లెల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

టేకులపల్లి: మండలంలో శుక్రవారం అకాల వర్షం ఆగమాగం చేసింది. రోడ్లు, వీధులు జలమయం అయ్యాయి. టేకులపల్లి సెంటర్‌లో ప్రధాన రహదారిపై వరద నీరు పారింది. రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు, నివాసాల్లోకి వరద నీరు పారింది. పలు గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంట తడవటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సింగ్యతండా, లచ్చతండా, బోడు, కొప్పురాయి, బేతంపూడి, గంగారం తదితర గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు వర్షం, ఈదురుగాలులకు నేలవాలాయి.

రైతులను ఆదుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: వడగళ్లు, ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని న్యూడెమోక్రసీ అనుబంధ అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం నాయకులు పర్యటించారు. గ్రామాలలో నేలవాలిన మొక్కజొన్న, ఇతర పంటలను పరిశీలించి పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, సంతు, పాడుగు నర్సింహారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పథకం.. పేదలకు వరం



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రారంభించారు. శిబిరంలో సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం కంటికి సమస్యలను ప్రతిఒక్కరూ నిర్లక్ష్యం చేస్తున్నారని, దీంతో దీర్ఘకాలిక సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వారికి కంటి పరీక్షలు చేయించుకునే సౌకర్యం ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుభాష్‌నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, ఎంపీటీసీ శీలం ఉమ, కోఆప్షన్ సభ్యుడు ఘాజీ, వార్డు సభ్యుడు ఆళ్ల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్, వైద్యసిబ్బంది డాక్టర్ అరుణ, చంద్రకళ, గ్రామపెద్దలు శీలం రమేష్, కొలిపాక శ్రీనివాస్, వల్లాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పునఃప్రతిష్ఠా మహోత్సవం



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: కాకర్ల గ్రామ సమీపంలోని పాలగుట్టపై స్వయంభూగా వెలిసిన శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాలస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయం పునఃనిర్మాణం చేశారు. ఆలయంలో శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాలస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠతోపాటు, శ్రీ నాగలింగేశ్వర స్వామి, నూతన దారు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. స్థానికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది. అదేవిధంగా గ్రామంలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. శ్రీ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు.

ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయండి



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ: ఈనెల 22వ తేదీ నుంచి 25 వరకు పాల్వంచలోని వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో పాల్వంచ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది సంబురాలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బిక్కసాని సుధాకర్, అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి వేముల కొండల్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్ వజ్రా హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉగాది ఉత్సవాలు ఈసారి 20వ సంవత్సరంలోకి చేరుకుంటున్నాయన్నారు. 22వ తేదీ సాయంత్రం 6గంటలకు కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఉత్సవాలు ప్రారంభిస్తారని, 23న మాజీ ఎమ్మెల్యే సాంబశివరావు, 24న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, 25న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా సినీ గాయని తేజస్విని ఆధ్వర్యంలో సంగీత విభావరి, కూచిపూడి, కోలాట, కొమ్ముడ్యాన్స్‌లు, జై భీం కళా బృందం జానపద నృత్యాలు, భరతనాట్యం, ఇతర డ్యాన్సులు, నృత్య ప్రదర్శనలు, పద్య నాటకం, కవితలు పోటీలు, ఉగాది పంచాంగం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కళాకారులు, అభిమానులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, డాక్టర్ నామా బుచ్చయ్య, కాల్వ దేవదాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ అరెస్టు అప్రజాస్వామికం

ఇల్లెందురూరల్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జి చేత న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేపట్టిన బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను హౌస్ అరెస్టు చేసి అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కాంపాటి నరేష్ అన్నారు. ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడం పట్ల కొమరారం గ్రామంలో నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్‌సీపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారి గొంతు నొక్కే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంపాటి లాజర్, కుమ్మరి రాజు, తేలే కిరణ్, ఆజ్మీర లక్ష్మణ్, బాదావత్ లక్ష్మా తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీ సంఘటనను నిరసిస్తూ బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్‌లో శాంతియుతంగా దీక్ష చేస్తుంటే ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయటాన్ని అందరూ ఖండించాలని, నిరసన తెలపాలని పార్టీ ఇల్లెందు నియోజకవర్గ నాయకులు కోరారు. శుక్రవారం ఇల్లెందు, కొమరారంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఇల్లెందులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేసి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లేతాకుల కాంతారావు, రాయల శ్రీనివాస్, పప్పుల గోపీనాథ్, తచ్చడి సత్యనారాయణ, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: ఉద్యమాలు ఉధృతమైతే పాలకులు తోక ముడుస్తారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు శుక్రవారం కామేష్ సంఘీభావం తెలిపారు. ప్రవీణ్‌కుమార్ తన స్వగృహంలో చేపట్టిన ఆమరణ దీక్షకు వెళ్లి మద్దతు తెలిపినట్లు చెప్పారు. తడికల శివకుమార్, నల్లగట్ల రఘు, సాయి, దాసు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

చలో మంచిర్యాల



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ఈనెల 25, 26, 27 తేదీలలో మంచిర్యాలలో జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం టేకులపల్లి ఏరియా కార్యదర్శి రాయండ్ల కోటిలింగం పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బోడు గ్రామంలో మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ కార్మికుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి హక్కుల కోసం కొట్లాడి అనేక విజయాలు సాధించిన చరిత్ర ఐఎఫ్‌టీయూకి ఉందన్నారు. 1995లో నూతన సంస్కరణల పేరుతో ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ తీసుకొచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఇంతులో భాగంగానే కోయగూడెం ఓపెన్‌కాస్టులో వందలాది మంది కార్మికుల పొట్టగొట్టే సర్ఫేస్ మైనర్ ప్రవేశపెట్టడం, కేఓసీ3 బ్లాక్‌ను ప్రైవేటీకరణ చేయడమేనన్నారు. మోదీ ప్రభుత్వం 44 లేబర్ చట్టాలను ఒక్క కలంపోటుతో తొలగించి నాలుగు లేబర్ చట్టాలుగా మార్చేసిందని విమర్శించారు. మహాసభలో భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకుని పోరాటాలకు రూపకల్పన చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మూర్తి, నరేందర్, మాడె నిర్మల, పూనెం సుక్కయ్య, వజ్జా ప్రశాంత్, మంగారావు, వినోద్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



అంగన్‌వాడీ భవన నిర్మాణం ఎప్పుడో?

టేకులపల్లి మండలం రేగులతండాలోని అంగన్‌వాడీ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరడంతో పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా మూడేళ్ల క్రితమే తొలగించారు. దీంతో రేగులతండా ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. కానీ అంగన్‌వాడీ భవనాన్ని మాత్రం నిర్మించడం లేదు. దూరంగా పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను రోడ్డు దాటి పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే నూతన అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మించాలని కోరుతున్నారు. – టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : కేఎం తార
సీడీపీఓ, టేకులపల్లి ప్రాజెక్టు
సెల్ నంబర్ : 9490002168